ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

కృత్తివెన్ను(పెడన): జాతీయ రహదారి 216పై రెండు లారీలు ఢీ కొన్న సంఘటన సోమవారం తెల్లవారుజామున కృత్తివెన్ను సమీపంలోని అడ్డపర్ర వద్ద చోటు చేసుకుంది. రహదారిపై ఆగి ఉన్న లారీని బెంగళూరు నుంచి మండపేట పేపర్ లోడుతో వెళ్తున్న మరో లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఢీ కొట్టిన లారీ ముందుభాగం పూర్తిగా ధ్వంసం అయ్యింది. కాగా ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

విజయవాడ స్పోర్ట్స్: ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో గుణదలకు చెందిన దంగేటి కరుణ కుమార్(27) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. ఏలూరు రోడ్డులోని చుట్టగుంట సమీపంలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడు గుణదలలోని తన ఇంటి నుంచి పండిట్ నెహ్రూ బస్టాండ్‌కు వెళ్తుండగా ఆర్టీసీ సిటీ బస్సు వెనుక నుంచి వేగంగా ఢీ కొట్టింది. బస్సు చక్రాలు అతని పై నుంచి వెళ్లడంతో కరుణకుమార్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు మృతుడి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడు తండ్రి త్రిమూర్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీల చూపు సీఎం వైఎస్ జగన్ వైపే

బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మారేష్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.మారేష్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న బీసీలు పార్టీలకు అతీతంగా తమ ఆత్మ గౌరవాన్ని పెంచుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపే చూస్తున్నారని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మారేష్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గురునానక్‌నగర్‌లోని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్రంలో ఉన్న బీసీల జీవన స్థితిగతులపై సోమవారం చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటుతున్నా ఇంతవరకు ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సామాజిక న్యాయాన్ని గీటురాయిగా చేసుకుని బీసీలకు రాజ్యాధికారం కల్పిస్తున్న ఏకైక వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. ముఖ్యమంత్రిగా జగన్ పదవీ బాధ్యతలను చేపట్టిన దగ్గర నుంచి నేటి వరకు బీసీల పక్షపాతిగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. స్థానిక సంస్థలు, మండల అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్మన్లు, మేయర్లు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు ఇలా ఏ విభాగంలో చూసినా బీసీలకు సముచిత స్థానం కల్పించిన మానవతావాది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.

చంద్రబాబు చేసింది శూన్యం..

ముఖ్యమంత్రిగా 14 ఏళ్ల అనుభవం ఉందని చెప్పుకుంటున్న చంద్రబాబు బీసీలకు చేసింది శూన్యమని మారేష్ పేర్కొన్నారు. ఆయన పాలనలో 25 శాతం దాటి ఏనాడూ బీసీలకు పదవులు ఇచ్చిన చరిత్ర లేదన్నారు. అటువంటి వ్యక్తి తమది బీసీల పార్టీ అని చెప్పుకుంటుంటే 65 శాతానికిపైగా బీసీలకు పదవులు ఇచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఏమనాలని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల కోసం ప్రైవేట్ బిల్లు తీసుకు వచ్చిన చరిత్ర సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబీరాణి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోర్ల మహిధర్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అర్షద్, విజయవాడ యూత్ అధ్యక్షుడు సాయి, అర్బన్ అధ్యక్షుడు మహమ్మద్ ఖలీమ్, తూర్పు అధ్యక్షుడు శివ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గాల అభ్యున్నతే లక్ష్యం

తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి



వావిలాలలో సంక్షేమ పథకాల బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

వావిలాల(తిరువూరు): సామాజికంగా వెనుకబడిన అన్ని వర్గాల అభ్యున్నతికే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తిరువూరు శాసనసభ్యులు కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మండలంలోని వావిలాలలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రెండో రోజు కొనసాగించారు. ప్రతి పేద కుటుంబం ఆర్థిక, సామాజిక అభ్యున్నతి సాధించే దిశగా పథకాలను రూపొందించారని, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ప్రజా సంకల్ప యాత్రలో పేదల కష్టాలను గుర్తించిన ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి ప్రయోజనకరమైన పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. తిరువూరు నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకం అందని కుటుంబం లేదని, రాజకీయ కారణాలతో పథకాలను నిలిపివేసే అవసరం తమకు లేదని స్పష్టం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, వైస్ ఎంపీపీ వెంకటనరసమ్మ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ విజయలక్ష్మి, సాంఘిక సంక్షేమ బోర్డు డైరెక్టర్ సుజాత, ముష్టికుంట్ల, వావిలాల పీఏసీఎస్ చైర్‌పర్సన్లు బండి రవి కుమార్, కొమ్మినేని కిశోర్, వావిలాల ఎంపీటీసీ సభ్యురాలు కంచిపోగు లక్ష్మి, మాజీ సర్పంచి రాజవరపు కృష్ణయ్య, పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ కంటిపూడి గోపాలరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గౌర్రాజు, తీగెల బాబు పాల్గొన్నారు. బీసీ కార్పొరేషన్ల పాలకవర్గాల పదవీ కాలాన్ని పొడిగించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

నేడు తెల్లదేవరపల్లిలో..

విస్సన్నపేట: మండలంలోని తెల్లదేవరపల్లి సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం ఉదయం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్. వెంకటరమణ సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పాల్గొని సంక్షేమ పథకాలు అమలు గురించి వివరిస్తారన్నారు. సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని సూచించారు.

పార్టీ విధానాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్దాం

కేంద్ర మంత్రి ప్రవీణ్ భారతి పవార్



మాట్లాడుతున్న కేంద్రమంత్రి ప్రవీణ్ భారతిపవార్

గుడివాడటౌన్: సమాజసేవ, సేవాతత్వం భారతదేశ సంస్కృతి అని ఆ అంశాలను అమలు చేస్తున్న ఏకైక పార్టీ భారతీయ జనతాపార్టీ అని కేంద్ర గ్రామీణ వైద్యశాఖ సహాయమంత్రి ప్రవీణ్ భారతిపవార్ అన్నారు. స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ, అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో కృష్ణాజిల్లా బీజేపీ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీజేపీ సేవాభావం కరోనా సమయంలో కార్యకర్తలు చేసిన సేవలకు నిదర్శనం అన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్య, వైద్యం, రవాణా, నీటిపారుదల, ఆహారం పంపిణీ, గ్రామీణ ఉపాధి వంటి అనేక కార్యక్రమాల్లో రాష్ట్రానికి పెద్ద ఎత్తున నిధులు సమకూరుస్తోందని ఆ విషయాన్ని కార్యకర్తలు క్షేత్రస్థాయికి తీసుకువెళ్లాలన్నారు. అప్పుడే 2024 సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో భారతీయ జనతాపార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఆమె అన్నారు. అనంతరం వివిధ పార్టీల నుంచి భారతీయ జనతాపార్టీలో చేరిన కార్యకర్తలకు ఆహ్వానం పలికారు. రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివన్నారాయణ, కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి తిరువూరి బుచ్చిరాజు, మీడియా సెల్ కన్వీనర్ లక్ష్మీపతిరాజ, జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లా పరిధిలో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో శక్తి కేంద్ర ప్రముఖ్‌ల సమావేశం భవానీపురంలోని బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు బబ్బూరి శ్రీరామ్ నివాసంలో సోమవారం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ పాల్గొన్నారు. తొలుత స్వాతంత్ర్య సమర యోధుడు సుభాస్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని ఆమె నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ బూత్ కమిటీ సభ్యులుగా నియమించిన ప్రముఖ్‌లతో మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణరాజు, కార్యదర్శులు సుధాకర్ యాదవ్, పాతూరి నాగభూషణం, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు

పామర్రు(పమిడిముక్కల): విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిలో పమిడిముక్కల మండలం గురజాడ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొక వ్యక్తికి తీవ్ర గాయాలపాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమంతపురానికి చెందిన పోరంకి పెద అప్పల రాజు(75), ఆయన సోదరుడు పోరంకి వెంకటరాజులు తమ టీవీఎస్ ద్విచక్రవాహనంపై విజయవాడ వైపు నుంచి వస్తున్నారు. ఈ క్రమంలో గురుజాడ వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన కారు వీరిని బలంగా ఢీ కొట్టింది. దీంతో అప్పల రాజు, వెంకటరాజులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలో పెద అప్పలరాజు మృతి చెందారు. ప్రస్తుతం వెంకటరాజు పరిస్థితి కూడా విషమంగానే ఉందని పమిడిముక్కల మండలం ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ప్రమాదానికి కారణమైన వ్యక్తికి ఏడాది జైలు

విజయవాడ స్పోర్ట్స్: నిర్లక్ష్యంగా బస్సు నడిపి ఆ బస్సు క్లీనర్ గాయాల పాలవడానికి కారణమైన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ విజయవాడ మూడో మెట్రోపాలిటన్ కోర్టు న్యాయమూర్తి యు.రామ్మోహన్ సోమవారం తీర్పు చెప్పారు. తూర్పుగోదావరి జిల్లాకు వ్యక్తి ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో క్లీనర్‌గా పని చేసేవాడు. 2021 ఫిబ్రవరి మూడో తేదీ అర్ధరాత్రి విజయవాడ హనుమాన్‌పేటలో ప్రయాణికులను ఎక్కించాడు. అనంతరం అదే ప్రాంతం నుంచి బస్సు రివర్స్ చేయాల్సి వచ్చింది. డ్రైవర్ కట్టమూర్తి లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు బస్సు రివర్స్ చేసేందుకు క్లీనర్ కిందకు దిగి సిగ్నల్స్ ఇస్తుండగా.. వేగంగా వెనక్కు వచ్చిన బస్సు క్లీనర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే తనకు గాయాలయ్యాయని క్లీనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో అదే రోజు కేసు నమోదయింది. బాధితుడు తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిద్దిక్‌అహ్మద్ న్యాయస్థానంలో వాదనలు వినిపించారు. ఏడుగురు సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు లక్ష్మీనారాయణకు జైలు శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, వ్యాయామోపాధ్యాయులు

మైలవరం: స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు జి. శ్రీనివాస్ తెలిపారు. మైలవరంలోని పాఠశాలలో ఆయన సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి కృష్ణా జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్ 14, అండర్ 17 బాల బాలికల ఫెన్సింగ్ పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన పి. కృష్ణ వెంకటగణేష్(ఇప్పీ), సీహెచ్. వెంకట లక్ష్మి (సాబర్)అండర్–14 విభాగంలో ప్రతిభ కనబరిచారన్నారు. అలాగే అండర్ 17 విభాగంలో కె. అంకమరావు(ఫాయిల్), కె. అరుణకుమారి(ఇప్పీ) విభాగంలో ఎంపికయ్యారన్నారు. వీరు రాష్ట్ర స్థాయిలో ఈ నెల 27 నుంచి కర్నూల్‌లో జరిగే పోటీలలో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, వ్యాయామోపాధ్యాయుడు కె. వెంకయ్య, జి. మెర్సీరోజీనా అభినందించారు.

ముగిసిన కళాపరిషత్ నాటిక ప్రదర్శనలు



బొజ్జా గౌరీ శంకర్‌ను సత్కరిస్తున్న కళాపరిషత్ నిర్వాహకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో నాగార్జున కళాపరిషత్ ఆధ్వర్యంలో 15వ వార్షికోత్సవ నాటకోత్సవాల్లో భాగంగా సుంకర–టి కృష్ణ మెమోరియల్ హాస్య నాటిక ప్రదర్శనలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ముగింపు సభలో ప్రముఖ నాటక రంగ విశ్లేషకులు, విజయవాడ స్నేహాలయ ఆర్ట్స్ నిర్వాహకులు బొజ్జ గౌరీ శంకర్‌ను కళాపరిషత్ నిర్వాహకులు దేవినేని కిశోర్ కుమార్ ఘనంగా సత్కరించారు. సినీ దర్శకులు ఎంవీ.రఘు, సెన్సార్ బోర్డు అధ్యక్షుడు మధుమోహన్‌కృష్ణ, సినీ నటులు పిళ్లా లక్ష్మీప్రసాద్, రంగస్థల నటులు ఆచంట బాలాజీ నాయుడు, కళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఒంగోలు వారు ప్రదర్శించిన 'పక్కింటి మొగుడు' నాటిక ప్రదర్శన ప్రేక్షకులకు హాస్యం పండించింది.

నవోదయ అడ్మిషన్లలో నిబంధనలతో నష్టం

కృష్ణా కలెక్టర్‌కు విన్నవించిన తల్లిదండ్రులు



చిలకలపూడి(మచిలీపట్నం): గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశం కోసం పెట్టిన వయసు నిబంధన, స్థానికత విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో విద్యార్థులు కృష్ణా కలెక్టర్ పి. రంజిత్‌బాషాకు వినతిపత్రం సమర్పించారు. నవోదయ విద్యాలయ సమితి ఇచ్చిన నోటిఫికేషన్‌లో 2009 మే 1వ తేదీ నుంచి 2013 ఏప్రిల్ 30వ తేదీ వరకు వయసు నిబంధనను ఇచ్చారన్నారు. 2023లో ఇచ్చిన నోటిఫికేషన్‌లో 2011 మే 1 నుంచి 2013 ఏప్రిల్ 30వ తేదీ వరకు వయసు పరిమితి ఇచ్చారని దీని కారణంగా నవోదయ విద్యాలయంలో ప్రవేశ పరీక్షలు రాసేందుకు వందల సంఖ్యలో విద్యార్థులు అర్హత కోల్పోతున్నారన్నారు. సమితి నిబంధనల ప్రకారం పిల్లలు ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్నారని, కానీ వయసు నిబంధన తక్కువగా ఇవ్వటం వల్ల ప్రవేశ పరీక్ష రాయలేకపోతున్నారన్నారు. దీనిపై కలెక్టర్ రంజిత్‌బాషా స్పందిస్తూ నవోదయ విద్యాలయ సమితికి లేఖపూర్వకంగా తెలియజేస్తానని, విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో విద్యార్థుల తల్లిదండ్రులు కె. వెంకటేష్, జి. సాంబశివరావు, ఎం. దివ్య, పి. జయలక్ష్మి, ఎం. వీర్రాజు తదితరులు ఉన్నారు.

సర్పంచ్‌ల పోరాటానికి మద్దతు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



సంఘీభావం తెలుపుతున్న వివిధ పార్టీలకు చెందిన నాయకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని సర్పంచ్‌లు, గ్రామాల సమస్యలపై సర్పంచుల సంఘం చేపట్టే అన్ని ఉద్యమాలు, పోరాటాలకు బీజేపీ మద్దతు ఇస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, సర్పంచుల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, గ్రామాల సమస్యలపై సోమవారం అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సోము వీర్రాజు కేంద్ర ప్రభుత్వం పంపిన నిధులను దారి మళ్లించడంపై సర్పంచుల సంఘం నాయకులు ఢిల్లీకి వస్తే కేంద్రానికి ఫిర్యాదు చేద్దామన్నారు. అనంతరం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రసంగించారు. జైభీమ్ పార్టీ నాయకుడు జడ శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హాకీ రాష్ట్ర సంఘం అవినీతిపై విచారణ చేయండి

- శాప్ ఎండీకి క్రీడాకారుల వినతి



శాప్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న హాకీ క్రీడాకారులు

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ హాకీ అసోసియేషన్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ చేసి.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీనియర్ హాకీ క్రీడాకారులు కోరారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) కార్యాలయం ఎదుట పలువురు హాకీ సీనియర్ క్రీడాకారులు 'సేవ్ హాకీ' నినాదాలతో సోమవారం ఆదోళన చేశారు. అనంతరం శాప్ వీసీ, ఎండీ డాక్టర్ ఎస్.ప్రభాకరరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. హాకీ రాష్ట్ర అసోసియేషన్ ప్రతినిధులు ఎన్నో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని వారు తెలిపారు. నైపుణ్యం ఉన్న క్రీడాకారులను పక్కకు నెట్టి అనర్హులకు సర్టిఫికెట్‌లు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. హాకీ సంఘానికి శాప్ గుర్తింపు లేదని తెలిపారు. క్రీడాకారుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ పనికిరాని సర్టిఫికెట్‌లను ఇస్తున్నారన్నారు. నేషనల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కోడ్ (ఎస్ఎన్‌డీసీ)–2011 ప్రకారం హాకీ సంఘానికి ఎన్నికలు నిర్వహించి, హాకీ క్రీడకు పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. శాప్ ఎండీకి వినతిపత్రం ఇచ్చిన వారిలో హాకీ సీనియర్ క్రీడాకారులు గురుభాస్కరరావు, సాయికుమార్ ఉన్నారు.



క్లుప్తంగా

పైపులైన్ పనులు ప్రారంభం

రెడ్డిగూడెం: స్థానిక ఎస్సీ కాలనీలో రూ. 54లక్షలతో జలజీవన్ మిషన్ పథకం ద్వారా చేపట్టబోయే పైపులైన్ పనులను సోమవారం రెడ్డిగూడెం జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయభాస్కరరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లాది రాణీ, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్టు, మండల పార్టీ అధ్యక్షుడు బలగాని తిరుపతిరావు, ఎంపీటీసీ సభ్యులు కుప్పిరెడ్డి వర ప్రసాద్‌రెడ్డి, ఉయ్యూరు భరత్ కుమార్‌రెడ్డి, భీమిరెడ్డి గోపిరెడ్డి, వార్డు మెంబర్ పైడిమర్ల శ్రీనివాసరెడ్డి, చాట్ల ఇమ్మానుయేలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కల్యాణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెట్టగుట్ట ఆలయంలో కేశఖండనశాల ప్రారంభం



మెట్టగుట్ట(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలను శివారు మెట్టగుట్టపై విరాజిల్లుతున్న శేషాచాల శ్రీనివాసస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో నిర్మించిన కేశఖండనశాలను సోమవారం ప్రారంభించారు. రూ. 3.50లక్షలతో నిర్మించిన కేశఖండనశాలను ఆలయ చైర్మన్ జె.ప్రతాపరెడ్డి ప్రారంభించారు. ఆలయ అర్చకులు శ్యామ సుందరాచార్యులు ప్రత్యేక పూజలు జరిపారు. కేశఖండనశాల నిర్మాణానికై పెనుగొలనుకు చెందిన బొలగాని అచ్చారావు, రుక్మిణమ్మ దంపతులు, బొలగాని రామకృష్ణ, అంజమ్మ దంపతులు రూ. లక్ష, అమ్మిరెడ్డిగూడెంకు చెందిన కె. జమలయ్య రూ. 25వేలు, పెనుగొలనుకు చెందిన వెదురు శ్రీనివాసరెడ్డి, రేగళ్ల నాగిరెడ్డి, ముక్కెర నరసింహారెడ్డి ఒక్కొక్కరు రూ. 10వేల చొప్పున విరాళంగా ఇచ్చినట్లు చైర్మన్ తెలిపారు.

సర్పంచ్ కుటుంబంపై దాడి దుర్మార్గం

జి.కొండూరు: ప్రజా ప్రతినిధులపై దాడులకు తెగబడుతున్న అసాంఘిక శక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో పోలీసులు వెనకాడవద్దని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. జి.కొండూరు మండల పరిధి గంగినేని గ్రామంలో ఆ గ్రామ వైఎస్సార్ సీపీ సర్పంచ్ పిల్లి రామారావు కుటుంబంపై టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడిన క్రమంలో ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ సోమవారం సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్పంచ్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ ఘటనపై పూర్తి విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని పోలీసులకు సూచించారు. గ్రామంలో జరుగుతున్న పరిణామాల దృష్ట్యా పోలీసులు భద్రతను ఏర్పాటు చేసి శాంతిభద్రతలను పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ



జి.కొండూరు: మండల పరిధి గంగినేని జిల్లా పరిషత్ హైస్కూల్‌ని నందిగామ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి గౌరీశంకర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలో రికార్డులు, లెసన్ ప్లాన్‌లు, డైరీలు, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. గౌరీశంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీ పడవద్దని చెప్పారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి ఉపాధ్యాయుల కృషి కూడా తోడైతే మంచి ఫలితాలు వస్తాయని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎలిమెంటరీ పాఠశాలలో..

నారికింపాడు(గంపలగూడెం): గంపలగూడెం మండలం నారికింపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఎంఈఓ సోమశేఖర్‌నాయక్ వార్షిక తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులు, రిజిస్టర్లు, విద్యార్థుల ప్రగతి, లెసన్ ప్లాన్లు, మోడల్ లెసన్లను పరిశీలించారు. జగనన్న గోరుముద్ద అమలు తీరును తనిఖీ చేశారు. జగనన్న గోరుముద్ద మెనూ సక్రమంగా అమలు చేయాలని వంట ఏజెన్సీ మహిళలను ఆదేశించారు. ఎస్ఏ-1 పేపర్లు దిద్ది సీసీఈ రిజిస్టర్ నందు నమోదు చేసి ఆన్‌లైన్లో అప్లోడ్ చేయాలని సూచించారు.

డెమోక్రటిక్ పీఆర్‌టీయూ డైరీ ఆవిష్కరణ

మైలవరం: మండల పరిషత్ కార్యాలయంలో డెమోక్రటిక్ పీఆర్‌టీయూ క్యాలెండర్, డైరీ, వాల్ స్టిక్కర్స్‌ను ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణి స్వామి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రసన్నరాణిస్వామి మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. యూనియన్ డైరీ, క్యాలెండర్‌ను ప్రచురించడం అభినందనీయమని, డైరీలో ఉపాధ్యాయులకు సంబంధించిన సమాచారాన్ని పొందుపర్చారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎస్. తిరుపతిరావు, ఎంపీడీఓ లక్ష్మీకుమారి, మండల విద్యాశాఖాధికారి రత్నశ్యాంబాబు, అసోసియేషన్ మైలవరం మండల అధ్యక్షుడు కే. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత నేతాజీ

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

తిరువూరు: ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమాన్ని మండలంలోని ఎర్రమాడు ఎంపీయూపీ స్కూలులో సోమవారం నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో నేతాజీ ధీరోచిత పాత్రను ప్రధానోపాధ్యాయుడు హరికృష్ణ విద్యార్థులకు వివరించారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): కేంద్రియ విద్యాలయంలో స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్‌చంద్ర బోస్ జయంతి పురస్కరించుకుని విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు సోమవారం నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో 9, 10వ తరగతి విద్యార్థులు 100మంది వరకు పాల్గొని ఆకర్షణీయమైన పెయింటింగ్‌లతో ఆకట్టుకున్నారు. న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ సత్యప్రసాద్, శివకుమార్, ప్రసాద్ వ్యవహరించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గిస్తాయని ప్రిన్సిపాల్ పీవీఎస్ఎస్ఎస్ఆర్ కృష్ణ అన్నారు. విజేతలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాసిన ఎగ్జామ్ వారియర్ పుస్తకం, స్వాతంత్ర్య సమరయోధుల బుక్స్ అందజేశారు.



నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మాతృభూమికి జీవితాన్ని దారబోసిన ధీరుడు

మైలవరం: మాతృ భూమికి తన జీవితాన్ని దారబోసిన ధీరుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేతాజీ జయంతి సందర్భంగా నివాళులర్పించారు.

నేతాజీని స్ఫూర్తిగా తీసుకోవాలి..

నేతాజీ సుభాష్ చంద్రబోస్ పోరాట పటిమను యువత అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు తెలిపారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమాన్ని మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ సేవా పథకం, స్ఫూర్తి క్లబ్ అధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా సుభాష్‌చంద్రబోస్ జయంతి..

జి.కొండూరు: సాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని గంగినేని జెడ్పీ హైస్కూల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుభాష్‌చంద్రబోస్ గొప్పతనాన్ని విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు.



చిత్రలేఖనం పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

ఘన నివాళి..

కొండపర్వ (విస్సన్నపేట): మండలంలోని కొండపర్వ ఎంపీయూపీ పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూల మాలవేసి నివాళ్లు అర్పించారు. స్వాతంత్రోద్యమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేసిన సేవలు విద్యార్థులకు పాఠశాల హెచ్ఎం జయరామ్ వివరించారు.

పేదల సొంతింటి కల సాకారం

ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్

జి.కొండూరు: నిరుపేదల దశాబ్దాల సొంతింటి కలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాకారం చేసిందని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. మండల పరిధి కందులపాడు శివారు గ్రామం చేగిరెడ్డిపాడు గ్రామంలోని జగనన్న కాలనీలో పక్కా గృహాల నిర్మాణానికి ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పక్కా గృహాల నిర్మాణంలో పేదలకు అవసరమై మౌలిక వసతుల కల్పనలో ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా ఇచ్చిన హామీని నెరవేరుస్తూ రాష్ట్ర వ్యాప్తంగా 31లక్షల మందికి పైగా అక్కచెల్లెమ్మలకు ఇళ్లపట్టాలను అందించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కృషి ఎనలేనిదన్నారు. గతంలో ప్రభుత్వాలు కేవలం ప్రభుత్వ భూమి ఉంటే ఇళ్ల పట్టాలు ఇచ్చేవారు కానీ, ఈ ప్రభుత్వం ప్రైవేటు భూములను సైతం రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసి పట్టాలను అందించడం దేశంలోనే ప్రథమమని వివరించారు. కందులపాడు గ్రామపంచాయతీ పరిధిలో 96మందికి ఇళ్ల స్థలాలు, 105మందికి పక్కా గృహాలను మంజూరు చేసినట్లు చెప్పారు. ఇంకా అర్హత ఉండి ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు రాని వారు ఉంటే దరకాస్తు చేసుకోవాలని సూచించారు.



చేగిరెడ్డిపాడులో ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్

పార్టీలకు అతీతంగా పథకాల అమలు

ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరవుతున్నాయని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆగిరిపల్లి మండల నెక్కలం గొల్లగూడెంలో సోమవారం మూడవ రోజు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందించారు. గతంలో ప్రభుత్వ పథకాలు అందాలంటే మండల కార్యాలయాలు, అధికారులు, నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని, నేడా పరిస్థితి లేదని అన్నారు. గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా జగనన్న మెరుగైన పాలన అందిస్తున్నట్టు చెప్పారు. రానున్న రోజుల్లో జగనన్నకు ప్రజలందరూ అండగా ఉండి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు, మండల ఇన్‌చార్జి మచ్చా హరిబాబు, ఎంపీపీ అనూష ఇసాక్, సర్పంచి లింగవరపు రమేష్, ఎంపీటీసీ సభ్యుడు గుర్రం శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పటాపంచల గోపాలరావు, నాయకులు నెక్కళపు కృష్ణ, గూండ్ల హనుమంతరావు, గజగంటి శ్రీనివాసరావు, తహసీల్దార్ ఉదయ్ భాస్కరరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



నెక్కలం గొల్లగూడెంలో పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

రోడ్డు భద్రత నియమాలను పాటిద్దాం

నూజివీడు: రోడ్డు ప్రమాదాల బారిన పడి యువత జీవితాన్ని కోల్పోతున్నారని, దీంతో తల్లిదండ్రులకు కడుపుకోతను మిగుల్చుతున్నారని డీఎస్పీ ఈ అశోక్‌కుమార్ గౌడ్ అన్నారు. 34వ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని స్థానిక జీఎంహెచ్ నర్సింగ్ కాలేజీ ఆడిటోరియంలో సోమవారం పాఠశాల, కళాశాలల బస్సు డ్రైవర్లకు కంటి పరీక్షలు, ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణ, రూరల్ సీఐలు ఎంవీవీఎస్ఎస్ మూర్తి, ఆర్ అంకబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ అశోక్ కుమార్

వైభవంగా గ్రామోత్సవం

గంపలగూడెం: ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆర్యవైశ్య సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని పలు గ్రామాలలో గ్రామోత్సవం కనులపండువగా జరిపారు. నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద నుంచి ప్రారంభమైన అమ్మవారి ఊరేగింపు కొణిజెర్ల, ఉటుకూరు, పెనుగొలను గ్రామాల ప్రధాన రహదారుల వెంట కొనసాగింది. ఊరేగింపు తమ ఇళ్ల ముంగిటకు రాగానే భక్తులు నీళ్లు వారబోసి టెంకాయలు కొట్టారు. గంపలగూడెం భజన మందిరం, ఉటుకూరు రామాలయాలలో కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు భక్తి శ్రద్ధలతో జరిపారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ

రెడ్డిగూడెం: మండలంలోని ముచ్చనపల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన ఇళ్ల పట్టాలను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయభాస్కర రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు బలగాని తిరుపతిరావు, సర్పంచ్ దేవళ్ల జమలయ్య, సీనియర్ నాయకులు గ్రామపార్టీ అధ్యక్షులు మద్దిరెడ్డి జమలారెడ్డి, ఉప సర్పంచ్ గంధం సుగుణరావు, చిన్నబ్బాయి, మట్టా తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి ఆలయ భూములను పరిరక్షించాలి

నూజివీడు: గొల్లపల్లి శ్రీరఘునాథస్వామి ఆలయం భూములను పరిరక్షించాలని కోరుతూ రామదండు పేరుతో ఏర్పడిన సన్న, చిన్నకారు రైతులు సోమవారం ఆలయ ఈఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆలయ 3300 ఎకరాల భూమిని నూజివీడు జమిందారు మేకా జగన్నాథ అప్పారావు ఆలయానికి 1860లో ఇచ్చారని, ఇందులో వెయ్యి ఎకరాలు ఒకేసామాజిక వర్గానికి చెందిన బడా భూస్వాములు, పారిశ్రామికవేత్తలు ఆక్రమించారని ఆరోపించారు. దేవదాయశాఖ అధికారులు రికార్డులను ట్యాంపరింగ్ చేసి వారికి తొత్తులుగా తయారయారన్నారు. ఒక రిటైర్డ్ ఉద్యోగి ఆలయంలోని తిష్ట వేసుకొని ఈ అక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తున్నాడని రైతులు వాపోయారు. దీనిపై ప్రభుత్వం విచారణ నిర్వహించి గొల్లపల్లి గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని రామదండు హెచ్చరించింది. కార్యక్రమంలో పలువురు సన్న,చిన్నకారు రైతులు పాల్గొన్నారు.

బలివే మహోత్సవాలను విజయవంతం చేద్దాం

సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

ముసునూరు: భక్తుల సేవయే, భగవంతుని సేవగా భావించి, అధికారులంతా ప్రజాప్రతినిధులు, దాతలు, వితరణశీలుర సహాయ, సహకారాలతో అత్యంత సమన్వయంగా పనిచేసి, బలివే మహా శివ రాత్రి మహోత్సవాలను విజయవంతం చేయాలని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పిలుపునిచ్చారు. బలివే రామలింగేశ్వరాలయ ప్రాంగణంలో ఉత్సవాల నోడల్ అధికారి తహసీల్దార్ దాసరి సుధ అధ్యక్షతన బలివే మహోత్సవాల ఏర్పాట్లపై ముందస్తు సమావేశం నిర్వహించారు. లక్షలాదిగా భక్తులు హాజరయ్యే బలివే మహోత్సవాలను సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు.సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చెన్ను రంగారావు, ఈఓపిఆర్డీ సత్యనారాయణ, సీఐ ఆర్. అంకబాబు, ఎస్సై కుటుంబరావు, ఎక్సైజ్ ఎస్సై, ఆలయ ఈఓ తల్లాప్రగడ విశ్వేశ్వరరావు, పంచాయతీ రాజ్ ఏఈ నరసింహారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

హనుమంత వాహనంపై శోభనాచలుని దర్శనం

ఆగిరిపల్లి: శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహ స్వామి మాఘమాస రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం స్వామివారు హనుమంత వాహనంపై విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10 గంటలకు స్వామి కల్యాణ మండపంలో శాంతి కల్యాణాన్ని శ్రీలక్ష్మీ నరసింహ జ్యూయలరీ మార్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాత్రి 7 గంటలకు గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో స్వామివారిని పెళ్లికుమారుగా అలంకరించి హనమంత వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణ మండపంలో నిత్య కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు వేదాంతం శేషుబాబు, జి.అనంతకృష్ణ, ఇతర వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ ఎన్.భవాని పర్యవేక్షించారు. స్వామివారి కల్యాణ మండపాన్ని దాతల సహకారంతో విద్యుత్ దీపాలతో అలంకరించారు.



హనుమంతుడి వాహనంపై దర్శనమిచ్చిన శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహ స్వామి

రెండు వేల లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

నూజివీడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) స్టేషన్ పరిధిలోని ముసునూరు, చాట్రాయి మండలాల్లో సోమవారం దాడులు నిర్వహించి రెండు వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ టి.గోపాలకృష్ణ తెలిపారు. ముసునూరు మండలం చెక్కపల్లిలో 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 12 లీటర్ల కాపుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో చెక్కపల్లికి చెందిన తాళం అప్పారావు, భూబత్తుల రాఘవేంద్రరావు, పామర్తి వెంకటేశ్వరరావు, బోట్ల రవిలను అరెస్టు చేయడంతో పాటు వీరికి బెల్లం సరఫరా చేసిన కొత్తగుండ్ల శ్రీనివాసరావు పైనా కేసు నమోదు చేశామని చెప్పారు. చాట్రాయి మండలం పోలవరం తమ్మిలేరు వాగులో కాపుసారా నిమిత్తం సిద్ధంగా ఉన్న 1500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతో పాటు లింగపాలెం మండలం వెస్ట్ యడవల్లికి చెందిన ఈదా రాజశేఖర్, మేనుపల్లి జనార్దనరావు, చిల్లిముంత సుబ్బారావు, ఈదా సాయిలపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. కాపుసారా తయారు చేసినా, విక్రయించినా, సరఫరా చేసినా ఫోన్ నెంబరు 9440902462కు తెలియజేయాలని కోరారు.



చెల్లని చెక్కు కేసులో జైలు శిక్ష

నూజివీడు: చెల్లని చెక్కు ఇచ్చిన నేరానికి విజయవాడకు చెందిన దివి వీరబ్రహ్మ గణేష్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.12 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. పట్టణానికి చెందిన ప్రత్తిపాటి చిన్నప్ప వద్ద వీరబ్రహ్మ గణేష్ రూ.8 లక్షలు అప్పుగా తీసుకుని, ఈ మేరకు చెక్కు ఈ బాకీ తీర్మానంలో భాగంగా 2018 మే 29న ఇచ్చాడు. ఈ చెక్కును బ్యాంకులో వేయగా, అతని ఎక్కౌంట్‌లో నగదు లేదన్నారు. చిన్నప్ప కోర్టులో కేసు దాఖలు చేయగా స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టు విచారణ చేసి నిందితుడికి పై విధంగా తీర్పు వెలువరించారు.

ఫిషర్‌మెన్ సొసైటీ నూతన పాలకవర్గం ఎన్నిక

పైడూరుపాడు(విజయవాడరూరల్): పైడూరుపాడు ఫిషర్‌మెన్ సొసైటీ నూతన పాలకవర్గం ఎన్నిక సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగింది.ఈ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్యానల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. సొసైటీ అధ్యక్షుడు రెంటపల్లి కోటేశ్వరావు, ఉపాధ్యక్షుడు నాందేటికోటయ్య(సంసాను), కార్యదర్శి మందా ఏసురత్నం, డైరెక్టర్లుగా మందా మస్తాన్, దొప్పల దేవదానం, కొంకా నిరంజన్, పెయ్యల రాంబాబు, తంగెళ్లమూడి పిచ్చియ్య ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వి.శీతారామయ్య, మండల పార్టీ కన్వీనర్ బయ్యారపు కిశోర్,పార్టీ నాయకులు, మత్స్యశాఖ అధికారిఅఖిల పాల్గొన్నారు. కొత్తగా ఎన్నికైన పాలకవర్గం అయిదేళ్లపాటు పదవిలో ఉంటుందన్నారు.

స్పందన అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి

నూజివీడు: స్పందనలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 11అర్జీలు రాగా ఏడీఏ విద్యాసాగర్, హెచ్ఓ హేమ, పలు ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

'స్పందన'లో నాలుగు అర్జీలు

గంపలగూడెం: గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో నాలుగు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ వై. పిచ్చిరెడ్డి తెలిపారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, వ్యవసాయ అధికారి సాయిశ్రీ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.



అర్జీలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

సంక్షిప్త వార్తలు

- **వాసవీమాతకు ప్రత్యేక పూజలు..**

తిరువూరు: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో సోమవారం వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో వాసవీమాత విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ సభ్యులు అభిషేకాలు, పూజాదికాలు జరిపారు. వాసవీ అనుబంధ క్లబ్‌ల అధ్యక్షులు దోసపాటి రవికుమార్, చిత్తలూరి అనురాధ, సుధాకర్, దారా శ్రీనివాసరావు, నాళ్లా సూర్యప్రకాశరావు, జోనల్, రీజనల్ సభ్యులు నాళ్లా రామారావు, వెంకటరమణ, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

- **రోగులకు రాయితీపై వైద్యసేవలు**

తిరువూరు: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ సందర్భంగా తమ ఆస్పత్రిలో ఈ నెల 26 నుంచి నెలరోజుల పాటు రాయితీపై వైద్యసేవలందిస్తామని అమరావతి ఆస్పత్రి చైర్మన్ కోనేరు కృష్ణన్ తెలిపారు. సోమవారం ప్రత్యేక వైద్యసేవలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, స్త్రీ, ప్రసూతి సేవలను, శస్త్రచికిత్సలను రాయితీపై అందిస్తామని తెలిపారు.

- **వార్డులో మున్సిపల్ కమిషనర్ పర్యటన**

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మునిసిపాలిటీ 27వ వార్డులో మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ సోమవారం పర్యటించారు. ప్రజలతో మాట్లాడి తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్లు, సీసీ రోడ్ల వంటి సమస్యలు తెలుసుకున్నారు. నాన్ ఫైనాన్షియల్ సమస్యలకు పరిష్కారం చూపారు. వార్డు కౌన్సిలర్ మామిళ్లపల్లి చైతన్య స్రవంతి, ఐవోసీ ఆనంద్ పాల్గొన్నారు.

- **యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ**

ఇబ్రహీంపట్నం: స్థానిక జాకీర్‌హుస్సేన్ కళాశాల రోడ్డులోని యువకులకు వైఎస్సార్ సీపీ నాయకుడు పచ్చిగోళ్ల పండు వాలీబాల్ కిట్లు సోమవారం అదజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువులతో పాటు క్రీడలు కూడా అవసరమన్నారు. క్రీడలు మంచి ఆరోగ్యానికి దోహద పడతాయన్నారు.

- **28న ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట**

విస్సన్నపేట: మండలంలోని తెల్లదేవరపల్లి తండాలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో ఈ నెల 28వ తేదీ ఉదయం 9.38 గంటలకు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభం ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించనున్నట్లు తెల్లదేవరపల్లి తండా భక్తబృందం సోమవారం తెలిపారు.

- **పాల సరఫరా పెరిగేలా కృషి**

పెనుగొలను(గంపలగూడెం): జగనన్న పాల వెల్లువ కేంద్రాలకు పాల సరఫరా పెరిగేలా సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీఓ వై. పిచ్చిరెడ్డి తెలిపారు. పెనుగొలనులో సోమవారం జగనన్న పాల వెల్లువ పథకంపై సిబ్బంది, పాడి రైతులు, డ్వాక్రా మహిళలతో సమీక్ష సమావేశం జరిపారు. పాల వెల్లువ కేంద్రాలకు పాలు సరఫరా చేసే రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను, వసతులను వివరించారు.

- **మృతుని కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం**

గంపలగూడెం: గంపలగూడెం-1 సచివాలయం పరిధిలోని మదరబోయిన వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందగా.. కుటుంబీకులకు తక్షణ సహాయంగా వైఎస్సార్ బీమా కింద రూ. 10వేలను సర్పంచ్ కోట పుల్లమ్మ సోమవారం అందజేశారు. నామినిగా ఉన్న మృతుని భార్య కృష్ణవేణికి ఈ మొత్తం అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

- **విద్యార్థులకు క్రీడాపోటీలు**

తిరువూరు: స్థానిక శ్రీనిధి స్కూలు 13వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం క్రీడాపోటీలు నిర్వహించారు. కళాశాల చైర్మన్ పోట్రు నాగేశ్వరరావు క్రీడాజ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. క్రీడాజ్యోతితో విద్యార్థులు పాఠశాల నుంచి బస్టాండు సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు.

- **సీజ్ చేసిన వాహనాలకు 25న వేలం**

మైలవరం: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ నందు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసులలో సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 25న వేలం పాట నిర్వహించనున్నట్లు ఎస్ఈబీ సీఐ గిరిజా సత్యకుమారి సోమవారం తెలిపారు. మొత్తం ఐదు వాహనాలకు 25వ తేదీ ఉదయం 10గంటలకు మైలవరం ఎస్ఈబీ స్టేషన్ వద్ద వేలం నిర్వహిస్తామన్నారు. వేలం పాటలో పాల్గొన దలచిన వారు ద్విచక్ర వాహనాలకు రూ.5వేలు, ఆటోలు, కార్లకు రూ.10వేలు చొప్పున ఈఎండీ కట్టి వేలంలో పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు జి. అనిల్‌బాబు, ఎస్ఐ ఎస్ఈబీ, 8897770007, కె. రాము, కానిస్టేబుల్ ఎస్ఈబీ 9492481841ను సంప్రదించాల్సిందిగా కోరారు.

- **విద్యార్థినులకు వ్యాస రచన పోటీలు**

తిరువూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ నెల 24న జరిగే జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు. బాలికల సంరక్షణ, బాల్య వివాహాలు, బాలల హక్కుల పరిరక్షణ, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఈ పోటీలు జరిపామని తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ..

జాతీయ బాలికా దినోత్సవ సందర్భంగా తిరువూరు భాష్యం పాఠశాలలో ఐడియాస్ సేవా సంస్థ రూపొందించిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు.

- **నోటికొచ్చినట్టు మాట్లాడితే ఊరుకోం**

నూజివీడు: టీడీపీ అధికార ప్రతినిధి కె.పట్టాభి తన నోటికొచ్చినట్టు మాట్లాడితే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని వైఎస్సార్ సీపీ పట్టణ నాయకులు హెచ్చరించారు. ఇటీవల ఆగిరిపల్లి మండలం ఈదులగూడెంలో నిర్వహించిన టీడీపీ కార్యక్రమంలో పట్టాభి పాల్గొని ఎమ్మెల్యేపైనా, ఎమ్మెల్యే తనయుడిపైనా అనుచిత వ్యాఖ్యల చేయడంపై వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యన్నారాయణ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, పట్టణ సచివాలయాల అధ్యక్షుడు పిల్లా చరణ్‌లు ఖండించారు. ఈ మేరకు సోమవారం వారు విలేకర్లతో మాట్లాడారు.

- **బాలికల స్వీయ రక్షణపై అవగాహన**

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): బాలికల స్వీయ రక్షణపై కొటికలపూడి ఎంపీయూపీ పాఠశాలలో బాలికలకు బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం సోమవారం జరిగింది. సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి కృష్ణకుమారి, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ చైతన్య బాలికలకు గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. బాలికల వ్యక్తగత సమస్యలు తెలుసుకుని పరిష్కారాలు సూచించారు. దాములూరు ఎంపీయూపీ ఉర్దూ పాఠశాలలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించి పోస్టర్లు ప్రదర్శించారు.

- **విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే ప్రతిఘటిస్తాం**

మైలవరం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరిస్తే ప్రతిఘటిస్తామని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు హెచ్చరించారు. ఈ నెల 30న జరగనున్న కార్మిక గర్జనకు సంఘీభావంగా సోమవారం నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న దీక్ష కార్యక్రమంలో భాగంగా మైలవరం నియోజకవర్గ స్థాయిలో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్ అండ్ బీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన దీక్ష శిబిరానికి కోటేశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు.

- **ఆత్మార్పణ దినోత్సవం**

చాట్రాయి: ఆర్య వైశ్యుల ఆరాధ్య దైవం వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని సోమవారం మండలంలోని చనుబండ గ్రామంలో నిర్వహించారు. చనుబండ కోదండ రామాలయంలో అమ్మవారికి కుంకుమ పూజ చేసి గ్రామంలో ఊరేగించారు.